క్లుప్తంగా

సారాతో వ్యక్తి అరెస్టు

రౌతులపూడి: సారా రవాణా చేస్తున్నారనే సమాచారంతో రౌతులపూడి శివారులో స్థానిక ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గ్రామానికి చెందిన అల్లు నానాజీ సుమారు 400 లీటర్ల సారాని తరలిస్తుండగా పట్టుబడ్డాడు. అతనికి సారా విక్రయించిన గుమ్మరేగుల గ్రామానికి చెందిన నిందుకుండల రమణ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. నిందితుడు నానాజీపై కేసు నమోదు చేసి తుని కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థి దశ నుంచే వ్యవసాయంపై అవగాహన అవసరం

గోకవరం: విద్యార్థి దశ నుంచి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని కోరుకొండ ఏడీఏ మల్లికార్జునరావు సూచించారు. మండలంలోని రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులను అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఆత్మా) ఆధ్వర్యంలో బుధవారం రంపచోడవరంలోని కృషి విజ్ఞాన కేంద్రానికి తీసుకువెళ్లారు. సుమారు 50 మంది విద్యార్థులతో వెళ్లిన వాహనాన్ని ఏడీఏ జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు ఈ క్షేత్ర పర్యటనను సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్ఎం ప్రమీలరాణి, ఉపాధ్యాయుడు జి.అంజనేయులు, వీహెచ్ఏ జె.జయశ్రీ, ఆత్మా సిబ్బంది పాల్గొన్నారు.

21న మాదిగల ఆత్మీయ సభ

తుని: ఈ నెల 21న రాజమండ్రిలో నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళనం సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనంతపు రాజు కోరారు. తుని పట్టణం కొండవారిపేటలో బుధవారం మందా కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఉమ్మడి గోదావరి జిల్లా అధ్యక్షుడు ముప్పిడి శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో చలో రాజమండ్రి కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన మాదిగలు రాజమండ్రి సభకు తరలిరావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాకా నూకరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దూలపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.


మహిళా పోలీసులకు న్యాయం చేయాలి

జగ్గంపేట: కూటమి ప్రభుత్వం మహిళా పోలీసులకు సాధ్యమైనంత త్వరగా న్యాయం చేయాలని మహిళా పోలీసు అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమణి కోరారు. రాష్ట్ర అసెంబ్లీలో బుధవారం మహిళా పోలీసుల భవిష్యత్తుపై చర్చించడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఏలేశ్వరం మండలం కొండ తిమ్మాపురంలో సారా స్థావరాలపై బుధవారం పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధం చేసిన 1,200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివ ప్రసాద్ తెలిపారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

చూసిన కనులకు వైభోగం


పంపా నదిలో సత్యదేవుని తెప్పోత్సవం

- కన్నులపండువగా సత్యదేవుని తెప్పోత్సవం
- వీక్షించి తరించిన భక్తజనం
- దేదీప్యమానంగా పంపా తీరం

అన్నవరం: 'క్షీరాబ్ధి ద్వాదశి తిథిని వీర వేంకట సత్య విభుని.. తెప్ప ఉత్సవమైన వేళ... ఏమీ వైభవ గాన లీల..' అని ప్రముఖ గాయకుడు బాలమురళీకృష్ణ గానం పంపా తీరంలో మార్మోగింది. నింగి నుంచి చంద్రుని చల్లని కిరణాలతో క్షీర సముద్రంలా ప్రకాశిస్తున్న పావన పంపా నదిలో సత్యదేవుని తెప్పోత్సవం బుధవారం రాత్రి అత్యంత వైభవంగా సాగింది. హంస వాహనంగా అలంకరించిన తెప్పపై వేదపండితుల మంత్రాలు, మంగళ వాయిద్యాలు, మిరుమిట్లు గొలిపే బాణసంచా వెలుగుల నడుమ సత్యదేవుడు, అనంతలక్ష్మి, సత్యవతీదేవి ముమ్మారు నదిలో విహరించారు. అశేష భక్తజనులు ఈ సుమనోహర దృశ్యాన్ని చూసి పరవశించిపోయారు.

స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

సాయంత్రం 5.30 గంటలకు దేవేరులతో పాటు సత్యదేవుడు, క్షేత్ర పాలకులైన సీతారాములను మేళ తాళాలతో రత్నగిరి నుంచి పంపా నదీ తీరానికి ఊరేగింపుగా తీసుకువచ్చి సింహాసనంపై ఉంచి పండితులు తులసీ ధాత్రి పూజ చేసి వేదాశీర్వచనాలు చేశారు.

హంస వాహనంపై దేవేరులతో సత్యదేవుని విహారం..

అనంతరం సత్యదేవుడు అమ్మవార్లను 6.30 గంటలకు ప్రత్యేక మంటపంలో ప్రతిష్ఠించి పంపా నదిలో మూడుసార్లు తిప్పి తెప్పోత్సవం నిర్వహించారు. నదీ తీరం వెంబడి, ఘాట్‌రోడ్డు పొడవునా భక్తులు ఆ వేడుకను తిలకించి పులకించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ తదితరులు పాల్గొనగా, వేదపండితులు గొల్లపల్లి ఘనాపాఠి, యనమండ్ర శర్మ, గంగాధరభట్ల గంగబాబు, ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, పురోహితులు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సన్నాయి మేళంతో స్వామి, అమ్మవార్లను ఆలయానికి చేర్చారు. ఈ సందర్భంగా ఘాట్‌రోడ్డు టోల్ గేటు వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


శ్రీ సత్యదేవుడు, అమ్మవార్లకు పూజలు చేస్తున్న పండితులు

విద్యుద్దీప కాంతులతో శోభిల్లిన పంపా తీరం

సత్యదేవుని తెప్పోత్సవం సందర్భంగా టోల్‌గేట్ వద్ద నుంచి పంపా తీరం వరకు విద్యుద్దీప కాంతులతో, మిరుమిట్లు గొలిపే బాణసంచా వెలుగుల్లో పంపా నది ప్రత్యేక శోభను సంతరించుకుంది.

300 మంది పోలీసులతో బందోబస్తు

తెప్పోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు, అన్నవరం ఎస్ఐ శ్రీ హరి బాబు, మరో 300 మంది పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ముందు జాగ్రత్త చర్యగా తుని నుంచి ఫైర్ ఇంజిన్‌ను పంపా తీరం వద్ద ఉంచారు. అలాగే గజ ఈతగాళ్లతో రెండు మోటార్ బోట్లు హంసవాహనం చుట్టూ రక్షణగా తిరిగాయి.

ఇసుక తవ్వకాలకెళ్లి వ్యక్తి మృతి

బండి తిరగబడి ఎద్దు మృత్యువాత


అప్పలనాయుడు మృతదేహాన్ని తాండవనది నుంచి బయటకు తీసుకువస్తున్న గ్రామస్తులు

కోటనందూరు: తాండవ నదిలోకి ఇసుక తవ్వకాలకు వెళ్లి వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని బొద్దవరం గ్రామానికి చెందిన కొత్తపల్లి అప్పలనాయుడు (40) బుధవారం ఉదయం ఐదు గంటలకు తాండవ నదిలో ఇసుక తవ్వకాలకు ఎడ్ల బండిపై వెళ్లాడు. నది ఒడ్డు నుంచి ఇసుక ఉన్న ప్రాంతానికి వెళ్లే క్రమంలో ఎడ్లబండిని నీటిలోకి దింపాడు. అక్కడ నది లోతుగా ఉండడంతో ఎడ్లబండి తిరగబడి ఒక ఎద్దు అక్కడికక్కడే మృతి చెందగా అప్పలనాయుడు గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై రామకృష్ణ హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని కుటుంబ సభ్యులు, స్థానికులు, ఈతగాళ్ల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన అప్పలనాయుడి మృతదేహాన్ని ఉదయం 10 గంటలకు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. అప్పలనాయుడు మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు. మృతుడికి భార్య, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు.

నాలుగు రెట్ల పరిహారం ఇస్తేనే..

- రైల్వేలైన్ కోసం భూసేకరణపై ఆర్డీఓకు రైతుల స్పష్టీకరణ


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీరమణి

తొండంగి: మండలంలోని గోపాలపట్నం రైల్వేస్టేషన్ నుంచి నాలుగు గ్రామాల మీదుగా రైల్వేలైన్ ఏర్పాటుకు భూసేకరణ కోసం పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి ప్రతిపాదిత భూముల రైతులతో బుధవారం సమావేశమయ్యారు. గోపాలపట్నం రైల్వేస్టేషన్ నుంచి ఎ.కొత్తపల్లి, శృంగవృక్షం, కోదాడ మీదుగా ఒంటిమామిడి దివీస్, మినీపోర్టు తదితర పారిశ్రామిక అవసరాల కోసం రైల్వే లైన్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో గోపాలపట్నంలో 13.73 ఎకరాలు, ఏ.కొత్తపల్లిలో 19.51 ఎకరాలు, శృంగవృక్షంలో 35.92 ఎకరాలు, కోదాడలో 13.65 ఎకరాలు, కోన ఫారెస్ట్‌లో 3.96 ఎకరాలు మొత్తంగా సుమారు 86.18 ఎకరాల భూమి సేకరణకు 205 మంది రైతులను గుర్తించారు. వారితో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీఓ సమావేశమయ్యారు. ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధర ప్రకారం భూమి కోల్పోతున్న రైతులకు ఒకటిన్నర రెట్లు అదనంగా ఇస్తామని రైతులకు ఆర్డీఓ వివరించారు. అయితే మార్కెట్ ధరలు అధికంగా ఉన్న నేపథ్యంలో నాలుగు రెట్లు పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రస్తుతానికి రైతుల అభిప్రాయాలు సేకరించి జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో అనుభవ రైతుల వివరాలపై అధికారులు సర్వే చేస్తారని, సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని ఆర్డీఓ వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురార్జీ, ఆర్ఐ రాజారావు, వీఆర్వోలు, ప్రతిపాదిత గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రంపయర్రంపాలెంలో నకిలీ టీపొడి కలకలం

1250 కేజీల సరకు సీజ్


రైస్‌మిల్లులో తనిఖీలు చేస్తున్న పోలీసులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్

గోకవరం: మండలం రంపయర్రంపాలెంలో నకిలీ టీపొడి తయారీ కలకలరం చేపింది. కొంత కాలంగా నకిలీ టీపొడి తయారు చేసి వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్న కేంద్రంపై స్థానిక పోలీసులు దాడులు చేసి సుమారు 1250 కేజీల టీపొడిని సీజ్ చేశారు. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రంపయర్రంపాలెంలో శ్రీవెంకటరామ రైస్‌మిల్లులో నకిలీ టీపొడి తయారు చేస్తున్నారని అందిన సమాచారం మేరకు కోరుకొండ సీఐ సత్యకిశోర్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడకు వెళ్లి తనిఖీలు చేసి 31 బస్తాల్లో నిల్వ ఉంచి 1250 కేజీల నకిలీ టీపొడిని, టీపొడి తయారీకి వినియోగించే ముడి సరుకు, బట్టల సోడాను గుర్తించారు. జీడిపప్పు పొట్టు నానబెట్టి, దానికి రసాయనాలు కలిపి టీపొడి తయారు చేస్తున్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. విషయాన్ని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం అందించగా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రుక్కయ్య అక్కడకు చేరుకుని వాటిని పరిశీలించి కొన్ని శాంపిల్స్‌ను సేకరించి మెటీరియల్‌ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిపోర్టు వచ్చిన తరువాత టీపొడి నకిలీ అని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఘనంగా జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ


లింగంపర్తిలో ప్రతిష్ఠించిన ద్వాదశి జ్యోతిర్లింగాలు

ఏలేశ్వరం: కార్తికమాసాన్ని పురస్కరించుకుని మండలంలోని లింగంపర్తిలో బుధవారం ద్వాదశి జ్యోతిర్లింగాల ప్రతిష్ఠాపన మహోత్సవం కన్నులపండువగా జరిగింది. వివేకానందా సేవాసమితి, శ్రీలలితా మాతృశ్రీ ఆధ్వర్యంలో పార్వతీ సమేత భోగేశ్వరా స్వామి ఆలయంలో ద్వాదశి జ్యోతిర్లింగాలను ప్రతిష్ఠించారు. తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

మల్లేపల్లిలో నగర సంకీర్తన

గండేపల్లి: కార్తిక మాసం సందర్భంగా మండలంలోని మల్లేపల్లిలో బుధవారం నగర సంకీర్తన నిర్వహించారు. సత్యదీక్ష మాలధారులు, భక్తులు తెల్లవారుజామున భక్తిగీతాలు ఆలపిస్తూ నగర సంకీర్తన చేశారు.

ఘనంగా కార్తిక వనసమారాధనలు


ధర్మవరంలో సప్తాహ మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నేత మురళీరాజు

కిర్లంపూడి: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని చిల్లంగి చింతలతోటలో వేంచేసిన కనక దుర్గమ్మ ఆలయం వద్ద బుధవారం భారీ వనసమారాధన నిర్వహించారు. రామచంద్రపురంలో తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో వనసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక పరిసర, గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరంలో బుధవారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ వనసమారాధన ఏర్పాటు చేశారు. అయ్యప్ప, శివస్వాములకు ప్రత్యేక కౌంటర్ల ద్వారా అన్నదానం చేశారు. చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

వైభవంగా సప్తహ మహోత్సవం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం కాశీవిశ్వేశ్వరసామి ఆలయంలో బుధవారం తృతీయ సప్తాహ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం పండితులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏడు రోజుల పాటు నిర్వహించే సప్తాహ మహోత్సవాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు ముదునూరి మురళీరాజు ప్రారంభించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జువ్వల బాబులు, నానిపల్లి చంటిబాబు, కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు, కుప్పన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముద్దాయికి జీవిత ఖైదు

జగ్గంపేట: ఇద్దరి హత్య చేసిన ముద్దాయికి జీవిత ఖైదు విధించినట్టు సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు తెలిపారు. 2013 ఏప్రిల్‌లో నమోదైన ఈ కేసుపై ఆయన తెలిపిన వివరాల మేరకు కల్లు గీత కార్మికులైన జగ్గంపేటకు చెందిన వానిశెట్టి సింహాచలం, నైనపు శ్రీను మండలంలోని సీతానగరంలో పక్కపక్కనే కల్లు వ్యాపారం చేస్తుంటారు. సింహాచలం భార్యతో శ్రీను వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో ఇందుకు సహకరించిన జగ్గంపేటకు చెందిన బత్తిన భవానిని (కనక) ఆమె ఇంటికి వెళ్లి కల్లుగీసే కత్తితో దాడిచేశాడు. దీంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. అదే రోజు రాత్రి సీతానగరంలో కల్లు విక్రయిస్తున్న శ్రీను దగ్గరకు వెళ్లి అతనిపైన కత్తితో దాడి చేశాడు. చికిత్స నిమిత్తం అతనిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అతడు అక్కడ మృతి చెందాడు. అప్పటి సీఐలు భరత్ మాతాజీ కేసు నమోదు చేయగా సుంకర మురళీ మోహన్ చార్జిషీట్ ఫైల్ చేశారు. విచారణ అనంతరం పెద్దాపురం కోర్టు ముద్దాయికి జీవిత ఖైదుతో పాటు రూ.1000 జరిమానా విధించినట్టు పేర్కొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని: స్థానిక జీఆర్పీ పరిధిలో పాయకరావుపేట రాజీవ్ కాలనీ ఎదుట జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి (30) మృతి చెందాడని ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం అందిన సమాచారం మేరకు ఘటన స్థలానికి ఆయన చేరుకుని వివరాలు వెల్లడించారు. తుని నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న రైలు పట్టాలు దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టింది. దీంతో మృతుడి శరీరం నుజ్జయ్యింది. నీలం రంగు జీన్స్, ఫుల్ హ్యాండ్స్ చొక్కా, చింత పిక్క రంగు లోదుస్తులు పది అడుగుల దూరంలో పడి ఉన్నాయి. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

పాడేరు: పొట్ట కూటి కోసం వలస వచ్చిన ఓ వ్యక్తి కూలి పనులు దొరక్కపోవడంతో మనస్థాపం చెంది బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్టు స్థానిక ఎస్ఐ సూర్యనారాయణ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కాకినాడ జిల్లా అన్నవరం సమీపంలోని పారుపాక గ్రామానికి చెందిన సారిపల్లి గంగరాజు (52) నాలుగు నెలల క్రితం కూలి పనుల నిమిత్తం పాడేరు వచ్చాడు. అప్పటినుంచి సక్రమంగా కూలిపనులు దొరక్కపోవడంతో నిరాశకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో కొత్త పాడేరు వద్ద వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం బావి వద్దకు దుస్తులు ఉతికేందుకు వెళ్లిన మహిళలు మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అది గంగరాజు మృతదేహంగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కోటనందూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకూ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి బి.నాగరత్నం బుధవారం తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించి గ్రంథాలయానికి పంపించాలని లైబ్రేరియన్ నాగలక్ష్మి విజ్ఞప్తి చేశారు.

కిర్లంపూడి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు కిర్లంపూడి, వీరవరం, గెద్దనాపల్లి గ్రంథాలయాలు ముస్తాబయ్యాయి. గురువారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకూ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 14న జాతీయ పతకావిష్కరణ, నెహ్రూ జయంతి వేడుకలు, చదరంగం పోటీలు, 15న పుస్తక ప్రదర్శన, డ్రగ్స్ నివారణపై అవగాహన, పుస్తక పఠనం ప్రాముఖ్యత, 16న గ్రంథాలయోద్యమంపై అవగాహన, 17న విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు, 18న వ్యాసరచన పోటీలు, 19న మహిళా దినోత్సవం, ఇందిరా గాంధీ జయంతి, ముగ్గుల పోటీలు, మహిళా సదస్సు, 20న చదువంటే మాకిష్టంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు వివరించారు.

హైందవ శంఖారావం కరపత్రం ఆవిష్కరణ

తుని: దేవాలయాల పరిరక్షణ కోసం వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ స్వామీజీ పిలుపునిచ్చారు. తుని మండలం కుమ్మరిలోవ తపోవనంలో బుధవారం హిందూ సంఘ పరివార సంస్థల ఆధ్వర్యంలో హైందవ శంఖారావం సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ దేవాలయాల స్వయం ప్రతిపత్తి, రక్షణ కోసం హిందువులు ఏకతాటిపై వచ్చి సంఘటితంగా ఉండాలని సూచించారు.

ఆకట్టుకున్న వీధి నాటకాలు

ప్రత్తిపాడు రూరల్/కిర్లంపూడి: ధర్మవరం, కిర్లంపూడిలో గౌరీ శంకరుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక కళాకారులు ప్రదర్శించిన సీతా స్వయంవరం, రామాయణం వీధి నాటకాలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ధర్మవరంలోని నంది సెంటర్, సీతంపేట, రామారావుపేట, మంగయ్యమ్మపేట, సినిమా హాలు సెంటర్లలో నాటకాన్ని ప్రదర్శించగా స్థానికులు తిలకించారు. నాటకంలో సీతగా అవ్వారి ప్రసాద్, రాముడిగా బర్ల శ్రీను, లక్ష్మణుడిగా కిల్లాడి రాజేష్, విశ్వామిత్రుడిగా రామకృష్ణ, జనకుడిగా పంపనబోయిన మణికంఠ నటించి మెప్పించారు.

'ముద్రగడ' వెంటే మా ప్రయాణం


ముద్రగడను కలిసిన జగపతినగరం వార్డు మెంబర్లు

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ముద్రగడ పద్మనాభం వెంటే మా ప్రయాణం అని పలువురు వార్డు మెంబర్లు అన్నారు. జగపతినగరం గ్రామ పంచాయతీకి చెందిన పలువురు వార్డు మెంబర్లు బుధవారం ముద్రగడ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయంలో మచ్చలేని నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. అలాంటి నేత అడుగుజాడల్లో నడవడానికి మేము ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కురుమళ్ల చిన్ని, శరకణం సంతోష్, ముత్తా పెద్దకాపు, వేగి సాంబశివ, చల్లా సత్య, పిల్లా నర్సరావు తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రౌతులపూడి: తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని మండలంలోని 104 ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని, 104 సేవలను ప్రభుత్వమే నిర్వహించి ప్రజాధనం వృథా కాకుండా చూడాలని కోరారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓకు జీఓ నంబర్ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 104 సిబ్బంది ఎ.సాయి గౌతమ్‌కుమార్, డ్రైవర్ ఎ.వీరబద్రరావు పాల్గొన్నారు.

ఘనంగా సత్యజ్యోతి ఊరేగింపు

అన్నవరం: క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినం సందర్భంగా బుధవారం అన్నవరంలో సత్యజ్యోతి ఊరేగింపు ఘనంగా జరిగింది. ఉదయం ఏడు గంటలకు రథంపై సత్యదేవుడు, అమ్మవారిని ఊరేగింపుగా గ్రామ శివార్లలో గల సాక్షి గణపతి ఆలయానికి తీసుకువెళ్లారు. అక్కడ స్వామి, అమ్మవార్లకు పండితులు ప్రత్యేక పూజలు చేసి సత్యజ్యోతి వెలిగించారు. ఊరేగింపుగా రత్నగిరికి తీసుకువచ్చి కళావేదిక మీద ప్రతిష్ఠించి పూజలు చేశారు. కార్తిక అమావాస్య వరకూ ఈ సత్యజ్యోతిని కళావేదిక మీదనే ఉంచి పూజలు చేస్తారు. దేవస్థానం ఏఈఓ కె.కొండలరావు, సూపరింటిండెంట్ సతీష్ తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ప్రత్యేక ఓటరు శిబిరాలకు 130 దరఖాస్తులు

ప్రత్తిపాడు: నియోజకవర్గంలోని 227 పోలింగ్ కేంద్రాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక ఓటరు శిబిరాల్లో 130 దరఖాస్తులు అందాయని అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారి, తహసీల్దార్ ఎం.సూర్యప్రభ బుధవారం తెలిపారు. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలతో పాటు ఏలేశ్వరం నగర పంచాయతీల్లో కొత్తగా ఓటరు నమోదుకు 100, మరణించిన, శాశ్వతంగా వలస పోయిన వారు తొలగింపులు కోరుతూ 16 దరఖాస్తులు, సవరణలు కోరుతూ 14 దరఖాస్తులు అందాయని వివరించారు. కొత్తగా ఓటరు నమోదు కోసం వచ్చిన దరఖాస్తుల్లో 33 మంది పద్దెనిమిది ఏళ్లు నిండిన యువత ఉన్నారని తహసీల్దార్ సూర్యప్రభ తెలిపారు.

ఆయిల్ పామ్ సాగు.. లాభాలు బాగు

- ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన
- గ్రామాల్లో జోరుగా పొలం పొలుస్తోంది కార్యక్రమాలు


ఎస్ఎస్ పట్నంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖ అధికారి అరుణ్‌కుమార్

రౌతులపూడి: రైతులు ఆయిల్ పామ్ సాగు చేపట్టడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని ఉద్యాన అధికారులు సూచించారు. మండలంలోని ఎస్ఎస్ పట్నంలో ఉద్యాన శాఖ అధికారి పి.అరుణ్‌కుమార్, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ సాగు చేపట్టిన రైతులకు వందశాతం రాయితీపై హెక్టార్‌కు రూ.27 వేలు విలువైన 143 మొక్కలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని ఉద్యానశాఖ అధికారి అరుణ్‌కుమార్ తెలిపారు. అంతరపంటల సాగుకు హెక్టారుకు ఏడాదికి రూ.5250 చొప్పున నాలుగేళ్ల పాటు అందిస్తుందన్నారు. పకృతి విపత్తులను ఎదుర్కొనే పంట ఆయిల్ పామ్ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పతంజలి ఫుడ్స్ మేనేజర్ బి.వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అధికారి జె.అయ్యప్ప, క్లస్టర్ ఇన్‌చార్జ్ చక్రధర్, ఉద్యానవన సహాయకుడు చిన్ని రైతులు పాల్గొన్నారు.

మానుపండు తెగులు పట్ల అప్రమత్తంగా ఉండాలి

శంఖవరం: వరి పంటలో సోకే మానుపండు తెగులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. మండలంలోని అన్నవరంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంటకు మానుపండు తెగులు సోకే అవకాశం ఉందన్నారు. ఈ తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కత్తిపుడిలో వరి పంటను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. ఏఈఓ మౌళి ప్రసాద్, వీఆర్వోలు, వ్యవసాయ సహాయకులు మణికంఠ, రజాక్, ప్రభాస్, రైతులు పాల్గొన్నారు.

గండేపల్లి: పంటల బీమా సొమ్మును రైతులే చెల్లించుకోవాలని మండల వ్యవసాయాధికారి సద్గురు మూర్తి సూచించారు. మండలంలోని బొర్రంపాలెం, మల్లేపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు 24–25 ఏడాదిలో రబీకి గాను పంట బీమాను మీ సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలన్నారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీహెచ్ఏ కనకయ్య, ఏఏఓ హరీష్, రైతులు పాల్గొన్నారు.